ప్రజాశక్తి
మంగళవారం 20 ఫిబ్రవరి 2024 5 అనంతపురం

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై గ్రీవెన్స్‌లో ప్రజలు అందించే సమస్యల పరిష్కారంపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఎమ్.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఒ జి.రామకష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్‌తో పాటు జిల్లా శాఖల అధికారులతో కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు. సమస్యలపై అర్జీలు పెండింగ్ ఉంచకుండా, రీఓపెన్ కాకుండా వాటికి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. గడువులోపు అర్జీలను నిత్యం మానిటర్ చేస్తూ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక దష్టి సారించి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి వరప్రసాద్, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, సిపిఒ అశోక్ కుమార్ రెడ్డితో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల షెడ్యుల్ వెలువడక ముందే ప్రచార వేడి పెరుగుతోంది. అనంతపురం జిల్లా కేంద్రంగా ప్రధాన పార్టీలన్నీ రాజకీయ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఇప్పటికే వైసిపి సిద్ధం సభను రాయలసీమ స్థాయి సమావేశాన్ని అనంతపురం జిల్లా రాప్తాడు కేంద్రంలో నిర్వహించారు. రెండు వారాల క్రితం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఉరవకొండలో పర్యటించారు. మరో పది రోజుల్లో చంద్రబాబు మరోసారి జిల్లా పర్యటనకు వస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో కాంగ్రెస్ పార్టీ కూడా అనంతపురం జిల్లా నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించబోతున్నట్లు ప్రకటించింది. ఇలా పార్టీలు ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ప్రచార వేడిని పుట్టిస్తున్నాయి.

ప్రచారవేడి..!

- పెరుగుతున్న నేతల తాకిడి
- వచ్చే వారంలో కాంగ్రెస్, టిడిపి యాత్రలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికార వైసిపి రెండు రోజుల క్రితం సిద్ధం పేరుతో రాప్తాడులో భారీ బహిరంగ సభను నిర్వహించింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్న ఈ సభకు రాయలసిమ జిల్లాల నుంచి పెద్దఎత్తున జనసమీకరణ చేపట్టారు. ఒక విధంగా సక్సెస్ అయిందని వైసిపి శ్రేణులు సంబరపడుతున్నాయి. ఈ సభ ద్వారా తమ సత్తాని చాటుతామని చెప్పారు. ఇకపోతే తాజాగా టిడిపి కూడా ప్రచారానికి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లు వచ్చే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈనెల 26 తరువాత జిల్లాలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు టిడిపి సిద్ధం అవుతోంది. అంతలోపు టిడిపి, బిజెపి, జనసేన పొత్తుల వ్యవహారం కూడా తేలే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక అభ్యర్థులను దాదాపు ఖరారు చేసే అవకాశాలున్నాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే కదలిరా కార్యక్రమాన్ని ఉరవకొండలో టిడిపి నిర్వహించింది. ఆ కార్యక్రమంలో చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఆ సభకు కూడా మంచి స్పందనే వచ్చిందని టిడిపి నాయకులు భావిస్తున్నారు. రాబోయే సభలను కూడా ఇదే విధంగా విజయవంతం చేస్తామని చెబుతున్నారు. ఇక కాంగ్రెస్ కూడా ఇక్కడి నుంచే రాష్ట్ర ఎన్నికల ప్రచారాన్ని ప్రాంభించనున్నట్టు ప్రకటించింది. దీనికి జాతీయ కాంగ్రెసు అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పిసిసి అధ్యక్షురాలు షర్మిల ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. జాతీయ స్థాయి నాయకులు హాజరవుతుండటంతో కాంగ్రెస్ కూడా తన బలాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమవుతోంది. సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి కూడా ఇప్పటికే కసరత్తు ప్రారంభించడమే కాకుండా మడకశిరలో తనకు పట్టున్న నియోజక వర్గం కావడంతో వచ్చే ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలన్న పట్టుదలతో ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా ఆయన సమావేశాలు నిర్వహించే పనిలో నున్నారు. నియోజకవర్గాల వారీగా ప్రభావం చూపే వారిని గుర్తించి బరిలో దింపేందుకు సిద్ధమ వుతోంది. మూడు ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని ఇక్కడి నుంచే మొదలుపెడుతుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కు తోంది. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రెండూ ప్రచారంలో పోటీపడుతున్నాయి. అభ్యర్థులు కూడా పూర్తి స్థాయిలో ఖరారైపోతే ప్రచారాలు మరింత తారా స్థాయికి చేరే అవకాశాలున్నాయి. ఇప్పటికీ అభ్యర్థులు అనుమానమున్న చోట పార్టీ కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఖరారైన చోట మాత్రం నేతలు రోజుకొక చోటకు పర్యటనలు జరుపుతున్నారు. సాధ్యామైనంత వరకు ఇంటింటికెళ్లి ప్రజలను కలుసుకునే పనిలోనున్నారు. ఏది ఏమైనా మండు వేసవి ప్రారంభంతోనే ప్రచార వేడి ఊపందుకోవడం గమనార్హం. కాగా జనసేన సందడి మాత్రం జిల్లాలో అంతగా కన్పించడం లేదు. పవన్‌కళ్యాణ్ ఇప్పటి వరకు ఇటువంటి ఎన్నికల ప్రచారాల్లోకి రాలేదు. తక్కిన మూడు ప్రధాన పార్టీల నుంచి మాత్రం నేతల తాకిడి పెరిగింది. రాబోయే రోజుల్లో ఇవి మరింత తారా స్థాయికి చేరే అవకాశాలు కన్పిస్తున్నాయి.

3న పల్స్‌పోలియో

పల్స్ పోలియో కార్యక్రమానికి పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మార్చి 3వ తేదీన జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారులు తెలియజేశారు. కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నాడు పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ - ఎన్ఐడి 2024కి సంబంధించి జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన పోస్టర్లను నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ ఐదేళ్ల వయస్సు వరకు గల ప్రతి చిన్నారికి ప్రతిసారి పోలియో మోతాదు ఇవ్వాలన్నారు. పిల్లలకు రక్షణ కల్పించడంలో ఎలాంటి తప్పులూ చేయరాదన్నారు. జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డా॥యుగంధర్ మాట్లాడుతూ మార్చి 3వతేదీ నుంచి 5వ తేదీ వరకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 0-5 ఏళ్ల లోపు 2,79,980 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 32 మండలాల పరిధిలో 3.80 లక్షల డోస్‌ల పోలియో వ్యాక్సిన్‌ను సరఫరా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి వరప్రసాద్, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిసిహెచ్ఎస్ డా॥పాల్ రవికుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డా॥సుజాత, డిప్యూటీ హెచ్ఈవో గంగాధర్ పాల్గొన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు నీటి వినియోగం తగ్గించుకోవడంతోపాటు పొదుపుగా వాడుకోవాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. సోమవారం నగరంలోని 29, 30వ డివిజన్ల పరిధిలో డిప్యూటీ మేయర్ విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి ఆయా డివిజన్లలో సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇటీవల మోటార్లు కాలిపోవడం వల్ల తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. నగర ప్రజలకు తగు మోతాదులో పూర్తిస్థాయిలో శుద్ధి చేసిన అనంతరమే తాగునీరు అందిస్తున్నామన్నారు. మోటారు రిపేరు చేసిన అనంతరం నీటి పరిమాణం పెరగడంతో చివరలో ఉన్న నివాసాలకు కూడా తాగునీరు అందుతున్నట్లు తెలిపారు. ప్రజల అనుమానాలను తీర్చడం కోసం ప్రజల సమక్షంలోనే కాలనీలలో నీటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రోజూ నగరపాలక తాగునీటి విభాగం సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తుంటారు. నీటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని, ముఖ్యంగా మహిళలు నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఇ సూర్యనారాయణ, డిఇ సుబాష, కార్పొరేటర్లు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

జర్నలిస్ట్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

సిపిఎం ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ఫొటో జర్నలిస్ట్ శ్రీక్రిష్ణపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్ట్‌పై దాడిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద సిపిఎం నాయకులు, కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ఫొటో జర్నలిస్ట్ క్రిష్ణపై దాడి ప్రజాస్వామ్యంపై చేసిన దాడిగా పరిగనిస్తున్నట్లు తెలిపారు. తన వత్తిలో భాగంగా బహిరంగ సభ దశ్యాలను కవర్ చేయడానికి వెళ్లిన వారిపై విచక్షణారహితంగా దాడి చేయడం అమానష చర్యని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు తమ రాజకీయ వైరుధ్యాలు ఉంటే పార్టీలతో పోరాడాలే తప్ప ఇలా వత్తి ధర్మంలో ఉన్నటువంటి విలేకరులపై ప్రతాపం చూపడం సరికాదన్నారు. తక్షణం పోలీసులు స్పందించి దాడి చేసిన నిందితులను శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు క్రిష్ణమూర్తి, చంద్రశేఖర్ రెడ్డి, సూరి, ప్రకాష్, వెంకటనారాయణ, ముస్కిన్, జీవ, మారుతి, నాగరాజు, బాలకష్ణ, రమేష్, పరమేశు, సిద్ధు, భీమేష్, రాజు, లాలెమ్మ పాల్గొన్నారు.

దాడిపై దుష్ప్రచారం తగదు : సిపిఎం

రాప్తాడులో జరిగిన వైసీపీ సిద్ధం సభలో కొందరు అల్లరి మూకలు ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణపై చేసిన దాడిని తప్పుదోవ పట్టించేలా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని సిపిఎం జిల్లాకమిటీ కోరింది. ఈ మేరకు సోమవారం నాడు వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహ్మయ్యకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఓ లేఖను రాశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ వత్తిరీత్యా ఆంధ్రజ్యోతిలో పనిచేస్తున్న కృష్ణ అత్యంత సౌమ్యుడన్నారు. అలాంటి వ్యక్తి మీద దాడి జరిగితే దాన్ని ఖండించి, అల్లరి మూఖలను నియంత్రించాల్సిందిపోయి తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ఫొటోగ్రాఫర్ కృష్ణ మహిళల చైన్ లాగాడని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని వైసిపి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడాన్ని సిపిఎం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోందన్నారు. ఇలాంటి సంఘటనలు ప్రజల విశ్వాసాన్ని పొందవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని గుర్తించి శిక్షించాల్సిన బాధ్యత వైసిపి ప్రభుత్వంపై ఉందన్నారు. ఇందుకు భిన్నంగా దాడిని తప్పుదోవ పట్టించేలా సోషల్‌మీడియాలో ప్రచారం చేయడం సరికాదన్నారు.

బోరులో నీరు రాకపోవడంతో మధ్యలోనే వదిలేసిన వేరుశనగ పంట

పంటను కాపాడుకునేందుకు కొత్తగా బోరు బావి వేసినా నీరు పడని పరిస్థితి..

అడుగంటిన జలం.. ఎండుతున్న పొలం..!

- రైతులను వెంటాడుతున్న కష్టాలు
- పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి
- అప్పుల ఊబిలో అన్నదాతలు

ప్రజాశక్తి-గార్లదిన్నె

ఆరుగాలం శ్రమించే అన్నదాతను కష్టాలు వీడడం లేదు. ప్రతి ఏడాది ఏదో రూపంలో పంటలు చేతికందక నష్టాలను తెచ్చిపెడుతూనే ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు రాకపోవడంతో విత్తనాలు కూడా వేయని పరిస్థితి నెలకొంది. బోరుబావుల కింద పంటలు సాగు చేద్దామంటే భూగర్భ జలాలు అడుగంటి ఆ పరిస్థితి కూడా లేకుండా పోతోంది. గార్లదిన్నె మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రస్తుతం సాగునీటి కష్టాలు రైతులను వెంటాడుతున్నాయి. మండల పరిధిలోని ముకుందాపురం, జమ్ములదిన్నె, కణంపల్లి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు బావుల్లో నీరు రావడం లేదు. దీంతో రైతులు సాగు చేసిన చీని లాంటి పండ్లతోటలతో పాటు వేరుశనగ పంటలు ఎండిపోతున్నాయి. దీనికి తోడు అనధికార కరెంటు కోతలు అన్నదాతలకు మరింత కష్టాలను తెచ్చిపెడుతోంది. లక్షలు అప్పు చేసి సాగు చేసిన పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో రైతులు ఎవరికి చెప్పాలో తెలియక దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ప్రతి సంవత్సరం వర్షాలతో పాటు మిడ్ పెన్నార్ రిజర్వాయర్ నుంచి జమ్ములదిన్నె చెరువుకు నీరు వచ్చేవి. ఈ సంవత్సరం అరకొర నీరు వచ్చాయి. నీటి లభ్యత తక్కువ కావడంతో ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడింది. జమ్ములదిన్నె గ్రామంలో సర్వే నెంబర్ 36లో రైతు కడంచు నాగేశ్వరరావు రబీలో 9.4 ఎకరాల్లో సాగుచేసిన వేరుశనగ పంట బోరుబావుల్లో నీరులేకపోవడంతో ఎండిపోయింది. ఇలాంటి రైతులు అనేక మంది పంటలను కోల్పోయిన తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు.

కళ్లేదుటే పంట ఎండిపోతోంది...

లక్షలాది రూపాయలు అప్పులు చేసి బోర్లు వేయించాను. పంట సాగుకు అప్పులు చేశాను. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పంట ఎండిపోతోంది. అదనంగా నీటి కోసం బోరు వేయించినా నీరు పడలేదు. కళ్లేదుటే పంట ఎండిపోతున్నా ఏమీ చేయలని పరిస్థితి ఉంది. పంట నష్టపరిహారంపై మండల వ్యవసాయ అధికారులను అడిగ ఇతే గార్లదిన్నె మండలానికి ఇన్పుట్ సబ్సిడీ రాలేదని చెబుతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటకే ఇంకా ఇన్సూరెన్స్ రాలేదు.

ఎండిపోయిన బోరు బావిని చూపిస్తున్న రైతు నాగేశ్వరరావు

ఇలాంటి పరిస్థితిల్లో రైతులు జీవనం కష్టాల మయం అయ్యింది.

రైతు నాగేశ్వరరావు, జమ్ములదిన్నె గ్రామం.

పింఛన్‌ను పునరుద్ధరించండి

నార్పల : తన భార్యకు తొలగించిన పింఛన్‌ను పునరుద్ధరించాలని మండల పరిధిలోని కురగానిపల్లి గ్రామానికి చెందిన పాపిరెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపిడిఒ రాముడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాపిరెడ్డి మాట్లాడుతూ తన భార్య సుబ్బమ్మకు చాల కాలం నుంచి వృధ్యాప్య పింఛన్ వచ్చేదన్నారు. అయితే గత మూడు నెలల నుంచి పింఛన్ రావడం లేదని వాపోయాడు. వెంటనే తొలగించిన పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఇందుకు ఎంపిడిఒ స్పందిస్తూ కేసేపల్లి వెల్ఫేర్ అసిస్టెంట్‌కు వెంటనే ఫోన్‌లో మాట్లాడి పింఛన్‌ను ఎందుకు తొలిగించారో తెలపాలని వివరణ అడిగారు. అంతేగాకుండా అర్హత ఉంటే తొలగించిన పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఆదేశించారు.

పింఛన్‌ను పునరుద్ధరించాలని ఎంపిడిఒకు విన్నవిస్తున్న పాపిరెడ్డి

పాలిటెక్నిక్ కళాశాల భవనం వద్ద సెల్ఫీ వీడియో తీసుకుంటున్న కాలవ శ్రీనివాసులు

నిరుపయోగంగా పాలిటెక్నిక్ కళాశాల భవనం

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు సెల్ఫీ వీడియో

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం విద్యారంగాన్ని సర్వనాశనం చేసిందని, సంస్కరణల పేరుతో పాఠశాలల సంఖ్యను కుదించి నిరుపేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. 50 వారాల సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా సోమవారం కాలవ పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల దుస్థితిపై 45వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. వైసిపి ప్రభుత్వం సాంకేతిక విద్యను భ్రష్టు పట్టించిందన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో చంద్రబాబు ప్రభుత్వం రూ. 4 కోట్లతో అదనపు భవనాలు నిర్మించిందన్నారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఈ భవనాన్ని వైసిపి ప్రభుత్వం ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కొత్త భవనంలో విద్యార్థులకు ఉపయోగ పడే అదనపు తరగతులు, హాస్టల్, లైబ్రరీని ఎందుకు వినియోగించడం లేదో సమాధానం చెప్పాలన్నారు. పాలకుల నిర్లక్ష్యానికి నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనమే సజీవ సాక్ష్యమని కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

సచివాలయాన్ని ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

ప్రజాశక్తి-శింగనమల

సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఈస్ట్ నరసాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం, వ్యవసాయ గోదాము భవనాలు, సలకంచెరువులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాల ద్వారా గ్రామస్థాయిలోనే ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా సచివాలయ వ్యవస్థ ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గ్రామాల్లోని ప్రజలు పట్టణాలకు వెళ్లకుండా, విలేజ్ క్లినిక్ ద్వారా ఇంటి దగ్గరకే వైద్యుల్ని పంపిస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతన్నలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైసిపి అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, ఎపి నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, ఎంపిపి యోగేశ్వరి, నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చెవిరెడ్డి, కల్లుముడి కొండయ్య, బంగారు అలిబాషా, నాగవర్ధన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, కోరే రాముడు, వైస్ ఎంపిపి గాండ్ల నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు

వైసిపి ఐటి వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి

మాట్లాడుతున్న వైసిపి ఐటి వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని వైసిపి ఐటి వింగ్ జిల్లా అధ్యక్షులు వై.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో రూ.2,300 కోట్ల సంక్షేమ ఫలాలు, రూ.1,307 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.125కోట్లతో జీడిపల్లి రిజర్వాయర్, రాళ్ల లిఫ్ట్ ఇరిగేషన్, ఇప్పేరు చెరువుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఎన్నాళ్ల నుంచో పెండింగ్‌లో ఉన్న జీడిపల్లి రిజర్వాయర్‌కు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు రూ.83కోట్లతో స్వీకరణ చేశారన్నారు. హంద్రీనీవా కాలువ కూడా 40 వేల క్యూసెక్కులు నుంచి 90 వేల క్యూసెక్కులకు పెంచడమేకాక రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా శ్రీశైలం వెంకజలాల ద్వారా 800 అడుగుల్లో కూడా నీళ్లు తీసుకునే అవకాశం కల్పించినట్లు వివరించారు. ఉరవకొండ అభివృద్ధి చెందాలన్నా, ప్రతి పొలాలకూ నీళ్లు రావాలన్నా వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు సత్యంరెడ్డి, వైఎస్‌ఆర్ ఎస్‌యు నియోజకవర్గ అధ్యక్షుడు తేజామూర్తి, యూత్ వింగ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సాకే పురుషోత్తం, నాయకులు రాంబాబు, తిలక్, విష్ణు, మారుతి, సురేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఎర్రినాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టిడిపి పొత్తుతో వైసిపిలో వణుకు

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్

మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్

ప్రజాశక్తి-ఉరవకొండ

టిడిపి, జనసేన పొత్తుతో వైసిపి శ్రేణులకు వణుకు మొదలైందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్ధం వేదికగా సిఎం జగన్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. టీ గ్లాసు ఎక్కడ ఉంచాలో.. తుప్పుపట్టిన ఫ్యాన్ని ఎక్కడ ఉంచాలో రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసు అన్నారు. నీతి, నిజాయితీ ఉన్న జనసేన అధినేత గురించి తప్పుడు మాటలు మాట్లాడితే సహించేది లేదన్నారు. అంతేగాకుండా సిద్ధం సభ వేదికగా సిఎం జగన్ ప్రసంగిస్తున్న సమయంలోనే వైసిపి రౌడీమూకలు మూకుమ్మడిగా విలేకరిపై చేసిన దాడి అమానవీయమన్నారు. 99 శాతం హామీలను పూర్తి చేశామని ప్రగల్భాలు పలుకుతున్న సిఎం జగన్ హామీల అమలుపై శ్వేతపత్రం రిలీజ్ చేసే ధైర్యం ఉందా? అని నిలదీశారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి రాగానే వారంరోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని, ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని, ధరల స్థిరీకరణ నిధి, ప్రకృతి విపత్తు నిధి కింద రూ.7వేల కోట్ల హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు, కూడేరు మండల అధ్యక్షులు చంద్రశేఖర్ తలారి గోపాల్, అచ్చునాల కేశవ, నగేష్, కార్యవర్గ సభ్యులు దేవేంద్ర, రాజేష్, రమేష్, మణికుమార్, నరేంద్ర, బోగేస్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి నివాళి

ర్యాలీ నిర్వహిస్తున్న భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు

ప్రజాశక్తి-పామిడి

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం పామిడి భావ సార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఇందులో భాగంగా పెద్ద పాండురంగ స్వామి ఆలయం నుంచి పట్టణ వీధుల గుండా బైక్‌ర్యాలీగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న శివాజీ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో శివాజీ చిత్రపటంతో రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భావ సార క్షత్రియ సమాజ్ యువజన అధ్యక్షులు జోజోడే కుమార్ మాట్లాడుతూ దేశ చరిత్రలోని గొప్ప యోధుల్లో చత్రపతి శివాజీ అగ్రగణ్యుడు అన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డబ్బిదార్ పిర్కా అధ్యక్షులు రఘునాథ్, క్లాత్ స్టోర్ శ్రీనివాసరావు, రంగుసుబ్బే పెర్కా అధ్యక్షులు టి.టి.నాగభూషణరావు, భావసార క్షత్రియ కళ్యాణమండపం అధ్యక్షులు మంజు, సంఘం పెద్దలు, పెద్ద ఎత్తున క్షత్రియులు పాల్గొన్నారు.

మెగా సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల్లో మెగా సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌కెయూకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో 2015 సెమిస్టర్ పద్ధతి ప్రారంభం రోజు నుంచి ప్రస్తుత సప్లిమెంటరీ రాస్తున్న విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించాలన్నారు. 4,600 మంది విద్యార్థులతో ఫీజు కట్టించుకొని పరీక్ష నిర్వహించలేదన్నారు. డిగ్రీలో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన వారు 5000 మంది ఉన్నారన్నారు. వారందరికీ అవకాశం కల్పించేలా మెగా సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ బి.భారతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ధన, పవన్‌గౌడ్, దర్శన్, రాజేష్, చరణ్, రామ్మోహన్, జిలాన్‌బాషా, విద్యార్థినులు నూర్జహాన్, మౌనిక, షాను తదితరులు పాల్గొన్నారు.

పాల్తూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పయ్యావుల

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ బీడీ చిన్న మారయ్య ఆధ్వర్యంలో సోమవారం 'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అణిచివేత ధోరణితో నిరంకుశ పాలన సాగిస్తోందన్నారు. ఈనేపథ్యంలో చంద్రబాబును సిఎంను చేసుకుంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కావున రానున్న సార్వత్రిక ఎన్నికలలో టిడిపికి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

బెలుగుప్ప : మండల కేంద్రంలో మంగళవారం 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల టిడిపి నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

పాఠశాలల తనిఖీ

రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ శ్రీనివాసరావు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్, హోలీ స్పిరిట్ పాఠశాలలను ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల విదాయ సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే తరగతి గదులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఇఒ నరసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

జర్నలిస్ట్ కృష్ణపై దాడి దుర్మార్గం

ఎస్పీ అన్బురాజన్‌కు పాత్రికేయ సంఘాల వినతి

ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జర్నలిస్టుల సంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు సిద్ధం సభ కవరేజ్‌కు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ శ్రీకృష్ణపై వైసిపి మూకలు దాడి చేయడం దుర్మార్గమని జర్నలిస్ట్ సంఘాల నాయకులు అన్నారు. ఫొటో జర్నలిస్ట్‌పై దాడిని ఖండిస్తూ సోమవారం ఎపిడబ్ల్యుఎ ఆధ్వర్యంలో అనంతపురం ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్, నాయకులు ప్రభాకర్ నాయుడు, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షఫీవుల్లా, రేపటి రామాంజినేయులు, గౌరవాధ్యక్షులు తలారి రామాంజినేయులు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఉపాధ్యక్షులు రసూల్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డానియల్, షేక్ మహమ్మద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు జగదీష్, యోగానంద, జాప్ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సిద్ధం సభ ప్రాంగణం వద్ద ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణారహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎస్పీ దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి చట్ట పరంగా శిక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు చౌడప్ప, చలపతి, పట్టుపోగుల రామాంజనేయులు, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి ఆధ్వర్యంలో నగరంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట బైటాయించి ఆందోళన చేపట్టి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఇకపోతే శ్రీకృష్ణపై దాడిని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టారు. పామిడి, నార్పల, గుంతకల్లు, ఆత్మకూరు, శింగనమల, గుత్తి, గార్లదిన్నె, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, బొమ్మనహాల్, డి.హీరేహాల్ మండలాల్లో జర్నలిస్టులు, టిడిపి, జనసేన, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు నిరసనలు చేపట్టారు.

ఇపిఎఫ్ డబ్బులను ఖాతాల్లో జమ చేయాలి

'స్పందన'లో సిఐటియు నాయకుల వినతి

అధికారులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 309 మంది ఇంజనీరింగ్ కార్మికులకు సంబంధించిన ఇపిఎఫ్ డబ్బులను వెంటనే ఖాతాల్లోకి జమ చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ కార్మికులకు సంబంధించిన ఇపిఎఫ్ మొత్తం 2011లో 11 నెలల డబ్బులు ఖాతాల్లో జమ కాలేదన్నారు. ఈ విషయమై అనేకమార్లు అధికారులకు విన్నవించినా, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వెంటనే జమ చేయాలని కోరారు. ఇందుకు డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు స్పందిస్తూ వచ్చేవారంలోపు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు తగదు

కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ అసిస్టెంట్ సునిల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. స్పందన కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకత్వంతోపాటు సిఎం జగన్‌ను అవమానపరిచే విధంగా అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేశాడని వాపోయారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ఇంజనీరింగ్ విభాగం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు మురళి, ఓబుళపతి, కోశాధికారి పోతులయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

వాలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

గ్రామాల్లో వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వాసవీ కల్యాణ మండపంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. అనంతరం నగదు బహుమతులు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సాంబ శివారెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ ఎంతో గొప్ప ఆలోచనతో సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. వీటితోపాటు వాలంటీర్ సేవలను గుర్తించిన ప్రభుత్వం భవిష్యత్తులో వారికి మరింత మేలు చేకూర్చేలా కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే జగనన్న ప్రభుత్వంలో నేరుగా వాలంటీర్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పథకాలను అందజేస్తున్నారన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు మాట్లాడుతూ సిఎం జగనన్న తీసుకొచ్చిన వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తుంటే మరోవైపు ప్రతిపక్ష పార్టీలు వాలంటీర్ల వ్యవస్థపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. వాలంటీర్ల వ్యవస్థతో నిరుపేదలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఇలాంటి పరిపాలన మళ్లీ రావాలి అంటే జగనన్న ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎపి నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, ఎంపిపి యోగేశ్వరి, నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చెవిరెడ్డి, కల్లుముడి కొండయ్య, బంగారు అలిబాషా, నాగవర్ధన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, కోరే రాముడు, వైస్ ఎంపిపి గాండ్ల నరసింహులు, అగ్రికల్చర్ ఏవో అన్వేష్‌కుమార్, ఎంపిఇఒ రాజారెడ్డి, ప్రతినిధులు, మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

ప్రజాశక్తి-గుంతకల్లు

వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ సిద్ధం సభలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. తన ఐదేళ్ల పాలనలో అభివృద్ధి చేయకపోగా ప్రజలకు రూ.10 ఇచ్చి తిరిగి రూ.100 వసూలు చేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారన్నారు. ప్రస్తుతం జగన్‌రెడ్డి అబద్ధాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. సైకో పాలన సాగిస్తున్న జగన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ప్రజలు బటన్‌ను నొక్కే ఇంటికి పంపేందుకు సిద్ధం అవుతున్నారన్నారు. జగన్‌రెడ్డి సైకో పాలనపై అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు విసుగు చెందారన్నారు. గత టిడిపి పాలనలో జరిగిన అభివృద్ధి పనులు మినహా వైసిపి ఐదేళ్ల పాలనలో చేసిందేమీ లేదన్నారు. అంతేగాకుండా జగన్ ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతో ఎక్కడికక్కడ ఎమ్మెల్యే అభ్యర్థులను మార్పు చేస్తున్నాడన్నారు. ఇకపోతే రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసిపి గుండాలు దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ కుమార్‌గౌడ్, నాయకులు మస్తాన్‌యాదవ్, కేశప్ప, నందీశ్వర, జింకల జగన్నాథ్, ఫజులు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ బిడ్డలందరికీ ధన్యవాదాలు

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

దేశ రాజకీయ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా రాప్తాడు నియోజకవర్గంలో నిర్వహించిన సిద్ధం సభకు తరలివచ్చి రాయలసీమ బిడ్డలందరికీ ధన్యవాదాలు అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా సిద్ధం సభ ఏర్పాట్లు చేశామన్నారు. పెత్తందారులతో పోరాడే క్రమంలో జగన్ వెంటే తాము ఉండేందుకు సిద్ధమని సభ ద్వారా కార్యకర్తలు నినదించారన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు తరలివచ్చారన్నారు. ఐదేళ్లలో పేదలకు చేసిన ప్రతి మంచి పనినీ తెలియజేస్తూ మళ్లీ రాజన్న రాజ్యం తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు ఎంపీలు 14 ఎమ్మెల్యే స్థానాలు గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

జర్నలిస్టులకు అండగా వైసిపి

జర్నలిస్టులకు వైసిపి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తోపుదుర్తి అన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికలకు స్వేచ్ఛ ఉంటుందన్నారు. అయితే వారు రాసే విషయాల్లో ఏదైనా బాధ కలిగించవచ్చని, ఆ బాధను తెలియజేసే స్వేచ్ఛ మనకు ఉంటుందన్నారు. అంతేగానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ మండల జెడ్పీటీసీ జూటూరు చంద్రకుమార్, రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, వైసీపీ రాష్ట్ర బిసి నాయకులు ధనుంజయయాదవ్, రాష్ట్ర నాయకులు నరేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభ విజయవంతంపై హర్షం

ఉరవకొండ : రాప్తాడు నియోజకవర్గంలో నిర్వహించిన 'సిద్ధం' భారీగా తరలివచ్చి విజయవంతం చేసిన వైసిపి నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సీఎం జగన్ వైసిపి కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపారన్నారు. దీంతో నూతనోత్సాహంతో వైసిసి శ్రేణులు ఎన్నికలకు సిద్ధం అవుతాయన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతున్న మంజునాథ

రాయదుర్గం : పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మంజునాథ(21) సోమవారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో అతడి రెండు కాళ్లు విరిగాయి. వాల్మీకినగర్ వాసులు రైలు పట్టాల వద్ద పడి ఉన్న మంజునాథను గమనించి ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. మంజునాథ డిగ్రీ పూర్తి చేసి కొంతకాలంగా గార్మెంట్స్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ డివిజన్ చేయాలని రైతుల వినతి

బొమ్మనహాల్ : మండలంలోని పలు గ్రామాలో రీ సర్వే చేసిన భూముల్లో జాయింట్ ఎల్‌పిలు 2వేల దాకా ఉన్నాయని, వాటిని విభజించి రైతులకు ఎవరు భూములను వారికి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో అర్జీలు అందాయని తహశీల్దార్ రామాంజనేయమ్మ తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు ఇచ్చిన అర్జీలను సంబంధిత విఆర్‌ఒలు, సచివాలయ సర్వేయర్లకు పంపినట్లు ఆమె తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయదుర్గం : రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని భావన ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఎంవిఐ విశ్వనాథరెడ్డి ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంవిఐ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల బస్సులో ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆటోలో పరిమితి లోపు ప్రయాణికులు ఉంటేనే ప్రయాణించాలన్నారు. జీబ్రా గుర్తుల వద్దే రోడ్డు దాటాలని, ఆ సమయంలో కూడా రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలను పరిశీలించి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు రాజగోపాల్, విద్యార్థులు, రవాణాశాఖసిబ్బంది పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఆధార్ సేవలు

రాయదుర్గం : పట్టణంలోని సబ్ పోస్టాఫీస్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌లో సేవలను సద్వినియోగం చేసుకోవాలని సబ్ పోస్ట్ మాస్టర్ జి.పద్మావతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమైన గుర్తింపు, ధ్రువీకరణ పత్రాలు తీసుకొచ్చి ఆధార్‌లో సవరణలు, మార్పులు, అప్‌డేట్ చేసుకోవచ్చున్నారు.

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు

పట్టణంలోని కోట మారమ్మ గుడి వీధిలోని 13వ సచివాలయం, పాత మీసేవా కేంద్రం వద్ద ఉన్న 2, 7వ సచివాలయాల్లో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ షేక్‌మాలిక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ పనిచేస్తుందన్నారు. 5 నుంచి 15 సంవత్సరాల వయసుగల వారికి కొత్తగా ఆధార్ నమోదు, 15 ఏళ్లు పైబడిన వారికి మొబైల్ నెంబర్ లింక్, చేర్పులు, మార్పులు, సవరణలు, 60 ఏళ్లు పైబడిన వారికి ఆధార్ బయోమెట్రిక్, అప్‌డేషన్, తదితర సేవలు అందిస్తారన్నారు.

నేడు వాలంటీర్లకు సన్మానం

నార్పల : మండల కేంద్రంలోని 7 హిల్స్ కళ్యాణ మండపంలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లను మంగళవారం ఘనంగా సన్మానించనున్నట్లు ఎంపిడిఒ రాముడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత మధ్యాహ్నం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించామని, అయితే అనివార్య కారణాల వల్ల 7 హిల్స్ కళ్యాణ మండపానికి మార్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని వాలంటీర్లు గమణించాలని కోరారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని 1వ సచివాలయంలో మంగళవారం వాలంటరీలకు వందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు చిన్నమచ్చన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డిఇఒకు సన్మానం

డిఇఒకు బొకే అందజేస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల అసోసియేషన్ సభ్యులు

పామిడి : ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా విద్యాశాఖాధికారిణి వరలక్ష్మిని సోమవారం జిల్లాకేంద్రంలోని డిఇఒ కార్యాలయంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా బొకేలు అందజేసి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పామిడి ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు కె.రామ్‌కుమార్, సెక్రటరీ చంద్రశేఖర్, డిసిఇబి సెక్రటరీ పురుషోత్తంబాబు, ప్రధానోపాధ్యాయులు నవీద, ఏకనాథం, నారాయణ, మద్దిలేటి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

పామిడి : స్థానిక భోగేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వ టి.సి. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రామాంజనేయులు శివమాల ధారణస్వాములకు సోమవారం అన్నదానం చేశారు. దాదాపు 200 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ వారోత్సవాలు

పుట్లూరు : మండలంలో నేటి నుంచి ఆధార్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దస్తగిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20, 21న పుట్లూరు, మడ్డిపల్లి, సచివాలయాలు, 22, 23న కోమటికుంట్ల, కుమ్మనమల సచివాలయాల్లో ఆధార్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జర్నలిస్టులకు భద్రత కల్పించాలి

అనంతపురం : రాష్ట్రంలో జర్నలిస్టులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాప్తాడులో నిర్వహించిన సిఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు కృష్ణపై దాడి చేయడం బాధాకరమన్నారు. స్వయానా సిఎం జగన్ సభలోనే జర్నలిస్టులపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం

ఉరవకొండ : పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉరవకొండ, బెలుగుప్ప ఎంపిపిలు నరసింహులు, పెద్దన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో జరుగుతున్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అమృతరాజు, ఇఒఆర్‌డి చంద్రమౌళి, గ్రామ కార్యదర్శి గౌస్‌సాహెబ్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.